ప్రజాశక్తి
బుధవారం 23 నవంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రగతి

- ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్
- సంబరంగా సత్యసాయి యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవం
- 22 మందికి బంగారు పతకాలు

విద్యార్థికి బంగారు పతకాన్ని అందిస్తున్న ఇస్రో ఛైర్మన్ డా॥సోమనాథ్ (ఇన్‌సెట్‌లో స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న ఇస్రో ఛైర్మన్)

భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమోఘమైన ప్రగతి సాధించిందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సత్యసాయి యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం నాడు సాయి కుల్వంత్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌తో సభా వేదికకు చేరుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో ఛైర్మన్ ప్రసంగించారు. అనంతరం విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 మంది విద్యార్థులకు బంగారు పథకాలు, 17 మందికి పిహెచ్‌డి పట్టాలు, 486 మందికి ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు.

వార్త మెయిన్‌లో..

60 ఏళ్ల తరువాత అత్యధికం

◆ తుంగభద్రకు ఈ ఏడాది 597.62 టిఎంసిలు ◆ 1961-62 తరువాత ఆదే అత్యధికం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర డ్యామ్‌కు 60ఏళ్ల తరువాత అత్యధికంగా ఈ ఏడాది నీరొచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు డ్యామ్‌కు 597.62 టిఎంసిల నీరు వచ్చింది. ఇంత పెద్దఎత్తున ఈ 60 ఏళ్లలో చూస్తే ఇది రెండోసారి కావడం గమనార్హం. 1961–62 సంవత్సరంలో డ్యామ్‌కు అత్యధికంగా 677.730 టిఎంసిల నీరు లభ్యమైంది. ఆ తరువాత నుంచి అత్యధికంగా ఒక్క ఏడాదిలో నీరు అధికంగా రావడం ఇది రెండోసారి. సుమారు 157 రోజులుగా నీరు డ్యామ్ నిండి దిగువకు పోయింది. ఇంత పెద్దఎత్తున నీరు దిగువకు పోయినా అనంతపురం జిల్లాకు అదనంగా జరిగిన ప్రయోజనమేమీ లేదనే చెప్పొచ్చు. సాధారణంగా వచ్చేంత నీటిని మాత్రమే తీసుకోవడం జరిగింది.

నీటి నిలువలేక వృథాగా దిగువకు...

తుంగభద్ర డ్యామ్ కిందనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దామాషా పద్ధతిలో అనంతపురం జిల్లాకు 32.50 టిఎంసిల కేటాయింపులున్నాయి. దీనికి అదనంగా కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో పది టిఎంసిలు కేటాయించారు. మొత్తంగా జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా 42.50 టిఎంసిల నీరు జిల్లాకు తీసుకోవాల్సి ఉంది. వరద సమయంలో అదనంగా తీసుకుని ఉంటే మరింత నీటిని జిల్లాకు తీసుకోవచ్చు. అయితే పాలకులకు సరైన చిత్తశుద్ధి లేక ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉంచడంతో ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి. దీంతో అవకాశమున్నా నీటిని ఈ ఏడాది కూడా 30 టిఎంసిలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇంకా అదనంగా 12 టిఎంసిలు తీసుకునే అవకాశమున్నా ఆ నీటిని నిలువ చేసుకునే వీల్లేక వదులుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రాజెక్టులు పూర్తయి ఉంటే...

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా పిఎబిఆర్ డ్యామ్‌కు నీటిని తీసుకునే అవకాశముంది. ఇది తీసుకోవడానికి ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు మధ్యలో ఆగిపోవడం మొదటి అవరోధంగా ఉంది. ఎంత నీరున్నా రెండు వేల క్యూసెక్కుల లోపే నీరు కాలువలో తీసుకోవడానికి వీలుంది. ఒకవేళ తీసుకున్నా నిలువ చేసుకోవడానికి పిఎబిఆర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉన్నా... పూర్తి సామర్థ్యంతో నీరు నిలువ చేయడం సాధ్యపడటం లేదు. ఇప్పటికీ ఈ రిజర్వాయరు ముంపు ప్రాంతాలకు పరిహారం చెల్లించలేదు. మరోవైపు ప్రాజెక్టు మొత్తం లీకేజీలతో ఉంది. దీంతో 11 టిఎంసిలు నిలువ చేయాల్సిన చోట ఐదు టిఎంసిలతోనే సరిపెట్టాల్సి వస్తోంది. దీనికి జియోమెంబ్రైన్ చేస్తే పూర్తి సామర్థ్యంతో నిలువ చేయవచ్చునని ఇంజినీర్లు చెబుతున్నా ప్రభుత్వం అటువైపుగా ఆలోచించడం లేదు. దీంతో ఇక్కడ ఆరు టిఎంసిలు అదనంగా నిలువ చేసుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇక గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఉంతకల్లు రిజర్వాయర్ ఐదు టిఎంసిలతో ప్రతిపాదించారు. ఇది డిపిఆర్ తయారీ దగ్గరే ఆగిపోయింది. ఇది అనుకున్న విధంగా పూర్తి చేసి ఉంటే ఇక్కడా మరో ఐదు టిఎంసిలు నీరు నిలువ చేయడానికి అవకాశం లభించేది. ఈ రకంగా పది టిఎంసిలు ఇప్పుడున్న వనరులతోనే నిలువ చేసుకునే అకాశముండింది. కాని సరైన సమయంలో పాలకులు నిర్మాణాలు చేపట్టకపోవడంతో నీరు తీసుకోలేకపోవడం జరిగింది.

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

వికేంద్రీకరణతోనే అభివృద్ధి

ప్రజాశక్తి -కదిరి టౌన్

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా మంగళవారం పట్టణంలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికేంద్రీకరణకు మద్దతుగా రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు చైతన్య, రాష్ట్ర కార్యదర్శి వి.రాఘవేంద్ర ,జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు పురుషోత్తం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం చేయాలన్న ఆలోచనతో ప్రచారం చేస్తున్నాయన్నారు.

హోమియోపతి వైద్యం కీలకం

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

వ్యాధుల నివారణలో హోమియోపతి వైద్యం కీలక పాత్ర వహిస్తోందని కలెక్టర్ బసంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో ఆయుర్వేద, హోమియోపతిఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ తో పాటు ఆయుష్ కమిషనరు వి. రాములు ప్రారంభించారు. సత్యసాయి జయంతి ఉత్సవాలలో భాగంగా ఆర్ వి జానకిరామయ్య ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు హోమియోపతి, ఆయుర్వేదంలో ఉత్తమ వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి, ఆయుష్ ఆర్‌జెడి కెవి. కుమార్ బాబు, వైద్యులు డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో మళ్లీ అదే పద్ధతి

మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు తిరిగి పాతపద్ధతినే అనుసరిస్తున్నారు. వారు రైతులకు, మార్కెట్‌కు, ప్రభుత్వానికి చేస్తున్న మోసం, అమలుకు నోచని ఈ–నామ్ విధానంపై ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మార్కెట్ కార్యదర్శి వెంకటేశులు ఇకపై వంద శాతం ఈ–నామ్ అమలు చేస్తామని చెప్పారు. దీంతో పాటు ఈ–నామ్ అమలు చేయని వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లకు నోటీసులు ఇచ్చి, ఇక నుంచి తప్పని సరిగా ఈ–నామ్ విధానంలోనే మార్కెట్‌కు వచ్చిన సరుకును కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే నోటీసులు ఇచ్చింది ఒక్క రోజు కోసమే అన్న విధంగా ఏజెంట్లు, వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. మంగళవారం జరిగిన మార్కెట్‌లో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు అదే పద్ధతి పాటిస్తు, ఈ–నామ్‌ను బద్నామ్ చేశారు. ఈ విషయాలన్ని ఇక్కడ పని చేసే సుపర్‌వైజర్లకు తెలిసినప్పటికి చూసి చూడనట్లు వ్యవహరించారు. నిబంధనల మేరకు తప్పు చేసిన వ్యాపారులపై, కమిషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ ఆదిశగా చర్యలు కన్పించలేదు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న యార్డు కార్యదర్శి ఇన్‌ఛార్జి కావటంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి.

గది కేటాయింపు కోసం కోర్టును ఆశ్రయించిన జెడ్పీటీసీ

ప్రజాశక్తి మడకశిర

జెడ్పీటీసీగా ఎన్నికై దాదాపు 18 నెలలు గడిచిన తనకు మండల కార్యాలయంలో గదిని కేటాయించలేదంటూ రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు హైకోర్టును ఆశ్రయించారు. స్థానిక ఎన్నికల సందర్భంగా అనంతరాజు వైసిపి తరపున జెడ్పీటీసీ టికెట్‌ను ఆశించాడు. అధిష్టానం టికెట్ ఇవ్వకపోవటంతో రెబల్‌గా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాడు. మాజీమంత్రి నర్సెగౌడ్ తనయుడిపై ఆయన విజయం సాధించారు. .నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వైసిపి మద్దతుతో విజయం సాధించిన జెడ్పీటీసీలకు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో గదులు కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన రొళ్ల జెడ్పీటీసీకి, టిడిపి మద్దతులో గెలుపొందిన అగళి జెడ్పీటీకి గదులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు గది కేటాయింపుపై హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు అనంతరాజుకు గదిని కేటాయించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను జెడ్పీటీసీ అనంతరాజు మంగళవారం స్థానిక అధికారులకు అందజేశారు. ఈ విషయంపై రొళ్ల ఎంపీడీవో రామారావును ప్రజాశక్తి సంప్రదించగా అధికారికంగా తనకు న్యాయస్థానం నుంచి ఆదేశాలు అందలేదని సమాధానం ఇచ్చారు.

గ్రామానికి బస్సు సర్వీసులు నడపాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండల కేంద్రంలోకి ఆర్టీసీ బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్ మురళీకృష్ణకు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ కారనంతో నెల రోజులుగా ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సులు సోమందేపల్లిలోకి రావడంలేదన్నారు. దీంతో మండల కేంద్రం నుండి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు సుమారు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న వైయస్సార్ సర్కిల్, కొత్తపల్లి క్రాస్ వద్దకు వెళ్లాల్సివస్తోందన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. గ్రామంలో నుండి బస్సులు వెళ్లే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పెద్దన్న, హనుమయ్య, మండల నాయకులు వెంకటేష్, రంగప్ప, కొండా వెంకటేష్, నాగభూషణ, గ్రామస్తులు వరలక్ష్మి, చంద్రకళ, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

వేతనాలిస్తే చాలన్న దుస్థితికి తెచ్చారు..!

- ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ తీరు దుర్మార్గం
- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి
- యుటిఎఫ్ ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని కోరే పరిస్థితి నుంచి చేసిన పనికి నెలవారీ వేతనాలు సకాలంలో ఇస్తే చాలన్న దుస్థితికి ప్రభుత్వ పాలకులు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మాట్లాడారు. ఉద్యోగులు పిఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుని నెలల తరబడి కావస్తున్న డబ్బులు చేతికందని దుస్థితి రాష్ట్రంలో లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తితే పోలీసులతో అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు ప్రభుత్వం గురి చేయడం అన్యాయంగా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారీ, పెత్తందారీ విధానాలు అనుసరిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. కేవలం కార్పొరేట్ కంపెనీలే లాభపడుతున్నాయని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపుతోందన్నారు. దాన్ని వ్యతిరేకించి ప్రజలను కలుపుకుని పోరాడాల్సిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి మొకరిల్లుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ప్రశ్నించేందుకు అధికార, ప్రతిపక్షాలు మోదీ దాసోహంగా వ్యవహరించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందన బట్టి భవిష్యత్ పోరాటాలు చేపడతామన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ పోరాటాల నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం కేసులు, నోటీసులు జారీ చేసి ఆందోళనలో నెట్టి వేయాలని చూడడం సరికాదన్నారు. యుటిఎఫ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, కె.నాగేంద్ర మాట్లాడుతూ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెబుతూనే ఉద్యోగులు వారి వేతనాల్లోంచి దాచుకున్న సొమ్మును ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ఏమిటని నిలదీశారు. సిపిఎస్ రద్దు చేస్తామని, జిపిఎస్ తీసుకురావడం కార్పొరేట్ కంపెనీలకు దాసోహం చేయడమే అవుతుందన్నారు. ఈ విధానాలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రజా సంఘాల మద్దతును కూడకట్టుకుని ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ ధర్నాకు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, రెండు జిల్లాల కోశాధికారులు రాఘవేంద్ర, సుధాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, శ్రీనివాసులు, తాహీర్‌వలి, హరిక్రిష్ణ, హనుమంతరెడ్డి, అర్జున్, రఘురామయ్య, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, ఆర్‌కె.రోజా

గుర్తుండిపోయేలా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

- కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి
- ఆకట్టుకున్న సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షో

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి బాబా 97వ జయంతోత్సవాలు ప్రస్తుతం జరుగుతున్నాయని, దీనికి కొనసాగింపుగా బాబా శతజయంతి ఉత్సవాలు భవిష్యత్తు తరాలకు గుర్తిండిపోయేలా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె.రోజాతో కలిసి ప్రారంభించారు. సత్యసాయి బాబా జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోని ప్రజలు, పర్యాటకులు తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆయన మాట్లాడుతూ బాబా శతజయంతి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున తాము కూడా ఇందులో భాగస్వామ్యం అవుతామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం తరపున సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కేంద్ర నెహ్రూ యువకేంద్రం (ఎన్ వై కెఎస్) వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్పర్సన్ ఓబులపతి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ప్రముఖులు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం పట్టపర్తికి చేరుకున్నారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను కలిశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ఈయనకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్ కుమార్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, కేంద్ర నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకెఎస్) వైస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతన్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు చలం, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, ఇన్‌ఛార్జి డిఆర్ఓ భాగ్యలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి చేయూతను ఇస్తుందన్నారు. పుట్టపర్తి ప్రాంత ప్రజలకు బాబా జీవిత విశేషాలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన లైట్ అండ్ లేజర్ షోను బాబా భక్తులకు అంకితమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి

బాధితుడికి ఆర్థికసాయం

కొత్తచెరువు : మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న మండల కేంద్రానికి చెందిన యువకునికి తెలుగుదేశం పార్టీ నాయకులు, వాల్మీకి సాధికారిక సమితి జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు బండపల్లి రాజు మంగళవారం ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు ఆయన బాధితుడిని అతడి స్వగృహంలో పరామర్శించారు. తనవంతు సాయంగా రూ. 5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, కడపగానిపల్లి శివ, మాల మనోహర్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుమరమ్మతులకు డిమాండ్

నల్లచెరువు : మండల కేంద్రంలోనివెలిస్తుంచు కూడలిలో గత కొన్ని రోజుల క్రితం పెద్ద గొయ్యి ఏర్పడి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కన్పించలేదని ప్రమాదాలు జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, ప్రాణాలు పోయిన తర్వాత చర్యలు తీసుకుంటారేమోనని సిఐటియు నాయకులు విమర్శించారు. ఈ మేరకు కాలనీవాసులు తమ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుల సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు భూములకు నీరు విడుదల

బుక్కపట్నం : జిల్లాలోని అతి పెద్ద చెరువు అయినా బుక్కపట్నం చెరువు కింద ఆయకట్టు భూములకు ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు స్వచ్ఛందంగా కాలువలలో పూడికతీత పనులు చేపట్టి వరి సాగుకు సిద్ధమయ్యారు. ఈసందర్భంగా స్థానిక చెరువులోని తూము ద్వారా రైతుల కాలువలకు పంట పొలాలకు సాగు కోసం మంగళవారం గంగపూజ అనంతరం నీటిని విడుదల చేశారు. ఈ చెరువు ద్వారా దాదాపు ప్రత్యక్షంగా పరోక్షంగా నాలుగు వేల ఎకరాల పొలాలు సాగులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాలక్ష్మి రాజు, ఇరిగేషన్ శాఖ డీఈ గంగాధర్, ఏఈ జమునా జాయ, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ నటరాజ్, అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, రామలింగారెడ్డి పెద్ద సంఖ్యలో ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

యువర్ ఫౌండేషన్ చేయూత

ధర్మవరం టౌన్ : గుండె సమస్యలకు సంబంధించి యాంజియోగ్రామ్ చేయుటకు ఉపయోగించే రూ.1లక్ష విలువ చేసే కాంట్రాస్ట్ ఇంజక్షన్లను యువర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అందజేశారు. ఆ ఇంజక్షన్లను 'అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రిన్సిపల్ డాక్టర్ నీరజమైరెడ్డి, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, అడ్మినిస్ట్రేటర్ శ్రీనివాస్ శౌరీ, కార్డియాలజిస్టు చంద్రబోస్, న్యూరాలజిస్టు రవిప్రకాష్ కు మంగళవారం అందజేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షులు వైద్య శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు వైకె శ్రీనివాసులు, సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు డాక్టర్ బీవీ సుబ్బారావు, పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, రమేష్ బాబు, జయరాం, బండినాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఓబులదేవచెరువు : మండల కేంద్రంలోని ఎం.కొత్తపల్లి బండపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం తహశీల్దార్ కనుకుంట్ల శ్రీధర్ అయ్యప్పస్వామి మాలధారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు, సివిల్ సప్లై అధికారి రామదేవి, సర్వేయర్ విజయ్ కుమార్, వీఆర్వోలు రమణస్వామి, నరసింహులు, సుధాకర్, శివప్ప, వీఆర్ఏలు రంగప్ప, సిఐ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పరిగి : బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దామని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో సరస్వతి పిలుపునిచ్చారు. మండలస్థాయి చైల్డ్ లైన్ అడ్వైజరీ బోర్డ్ బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీ సభ్యులు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహశీల్దార్, ఎంపిడిఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని మండలంగా పరిగి మండలాన్ని తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా చైల్డ్ లైన్1098 సమన్వయకర్త కృష్ణమోహన్, కోఆర్డినేటర్ ఆదినారాయణ, సిడిపిఓ రెడ్డి రమణమ్మ, ఇఒఆర్‌డి చంద్రశేఖర్, ఎస్ఐ హెదయతుల్లా, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సిబ్బంది సురేష్ కుమార్, ఇర్ఫాన్, విలేజ్ రెవెన్యూ అధికారులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలకు మడకశిర విద్యార్థులు

మడకశిర : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి తెలిపారు. ఆర్గనైజేషన్ ఫర్ నేషనల్ లెవెల్ ఆర్ట్ కాంపిటీషన్ ముంబై వారు రంగోత్సవ సెలబ్రేషన్ పోటీలను ఆగస్టు నెలలో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న బాలికోన్నత పాఠశాలలో 9 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. టిఆర్ .తేజస్విని, గౌతమి, సాక్షి ప్రియ, నసీమా, ఫరూక్ ఖాన్, ఎ.తేజస్విని, పల్లవి, ఇందు, అరవింద రాజు ,తేజస్విని అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కురుబల మహాసభను విజయవంతం చేయండి

కొత్తచెరువు: ఈనెల 27వ తేదీన పుట్టపర్తిలో జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ, చెన్నప్ప, కమ్మన్న, శివానంద తెలిపారు. మంగళవారం పుట్టపర్తి రోడ్డులో ఉన్న కనకదాసు విగ్రహం వద్ద ప్రచార రథాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 32 మండలాల్లోనూ ఈ రథం ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని కురుబలు ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగడి ప్రభాకర్, రామచంద్ర, బుక్కపట్నం మంజు, జయచంద్ర, ఆదినారాయణ, చిన్నకృష్ణ, రాము, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ఈనెల 27న పుట్టపర్తిలో జరిగే కురుబల బహిరంగసభను విజయవంతం చేయాలని కురుబ సంఘం మండల నాయకులు కోరారు. స్థానిక వీరభద్ర స్వామి గుడి వద్ద కురుబసంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ 27న పుట్టపర్తి లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప , కమ్మన్న, కేశవ ఆదినారాయణ, కుంటల పుల్లయ్య , గుండ్లమడుగు వెంకట వరద తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు వినతి

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని అబ్దుల్లా కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆ కాలనీవాసులు ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను కోరారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల-పరిష్కార వేదికలో ఆ ప్రాంత ప్రజలు తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

సినీహీరో కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలి

ధర్మవరం టౌన్ : సినీహీరో కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

హిందూపురం : నియోజకవర్గంలోని పలువురు బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు. ఏడుగురికి రూ. 4.16లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపిని గద్దె దింపుదాం : బికె

ప్రజాశక్తి రొద్దం

పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రైతుల బతుకులు మారాలంటే వైసిపిని గద్దె దింపాల్సిందేనని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి అన్నారు. మండల పరిధిలోని దొడగట్ట గ్రామం నుండి రెడ్డిపల్లి, పెద్ద గువ్వల పల్లి,గ్రామాల మీదుగా రొద్దం తహశీల్దార్ కార్యాలయం వరకు బికె ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పాదయాత్ర . నిర్వహించారు. పాదయాత్రలో రైతుల సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. పాదయాత్రలో నాయకులకు ఆయాగ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పాదయాత్ర అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్ద్ అనంతాచారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు ఈ చిన్నప్పయ్య, జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, రామకృష్ణప్ప, నరహరి, మహిళా అధ్యక్షురాలు పి సుబ్బరత్నమ్మ, లీలావతి , తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఈసీ హరీష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

'దోస్తాన్' సినిమా టీజర్ విడుదల

ప్రజాశక్తి కదిరిటౌన్

దోస్తాన్ సినిమా యూనిట్ సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సినిమా టీజర్‌ను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి పట్టణం బేర్ పల్లి కాలనీ చెందిన సూర్యనారాయణ దోస్తాన్ సినిమా డైరెక్టర్, ప్రొడ్యూసర్ గా వ్యవహరించి మంచి సినిమాను ప్రజల ముందుకు తీసుకొస్తున్నందుకు అభినందించారు. ఈ సినిమా ప్రేక్షకులను ఆనందింపజేసి మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ టెంపుల్ డైరెక్టర్ సంజయ్ బాబు, జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పుర పాలక సంఘంలోని మురుగువాడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని 32వ వార్డు లోని అహ్మద్ నగర్ లో రూ.41.5 లక్షలతో చేపట్టిన పెద్ద కాలువకు రక్షణ గోడ నిర్మాణం, నూతన సీసీ రోడ్డు నిర్మాణనికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్ రేష్మా బాబు, కౌన్సిలర్లతో పాటు వైసిపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, లతీఫ్ సేట్, ఖలీల్, కిరోసిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ట్రాభివృద్ధిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య విమర్శించారు. మంగళవారం కదిరి పట్టణంలోని అత్తార్ రెసిడెన్సీలో సత్య సాయి సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి, కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నాయని విమర్శించారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో ఎనిమిది వేల ఎనిమిది వందల నలభై నాలుగు ఎకరాల భూమిని దర్జాగా రాష్ట్ర ముఖ్యమంత్రి మేనల్లునికి చౌకబారు ధరకు కట్టబెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లో రాష్ట్రంలో ఇసుక మాఫియా, మద్యం మాఫియా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దీనంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా రైతులు పోరాటాలు చేయడానికి సమాయత్తమవుతున్నారని అన్నారు. డిసెంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతాంగ సమస్యలపై పోరాటాలు చేయడానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్, చేనేత రాష్ట్ర నాయకులు జింకా చలపతి, పుట్టపర్తి కార్యదర్శి ఆంజనేయులు, ఎఐటియుసి టి.బయన్న, సురేంద్ర చౌదరితో పాటు జిల్లాలోని అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి గుడిబండ

మడకశిర నియోజకవర్గంలోని శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల నూతన కమిటీని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. అమరాపురం మండలం బసవనపల్లి పంప్ హౌస్ దగ్గర శ్రీరామ్ రెడ్డి కార్మికుల సమావేశాన్ని మాజీ అధ్యక్షులు పాతప్ప అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కార్మికుల నూతన కమిటీని ఎంపిక చేశ్శారు. మడకశిర తాలూకా శ్రీరామ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం అధ్యక్షులుగా జమ్ములబండ గ్రామానికి చెందిన టిఎల్ రఘు, కార్యదర్శిగా అమరాపురం మండలానికి చెందిన హనుమంతరాయప్ప, కోశాధికారిగా నీలకంఠాపురం గ్రామానికి చెందిన దాసప్పను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులు రఘు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేస్తామనితెలిపారు .ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంస్థ కార్మికులు, మాజీ అధ్యక్షులు పాతప్ప, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు కళాత్మక నైపుణ్యం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి బుక్కపట్నం

విద్యార్థులు చదువుతోపాటు కళాత్మక నైపుణ్యం అలవర్చుకొని అన్ని రంగాలలో రాణించాలని ఇన్‌ఛార్జి డిఇఒ మీనాక్షి, విశ్రాంత డైట్ ప్రిన్సిపల్ మునయ్య సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా శిక్షణ కేంద్రంలో డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీసీఆర్టీ జిల్లా కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లానుంచి 78 మంది విద్యార్థులు హాజరుకాగా ఆరు విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతతకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులలో కళాత్మక నైపుణ్యం కోసం ఇలాంటి పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఇవి విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ రంగస్వామి, జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ భాస్కర్, ఎంఇఒ గోపాల్ నాయక్ , జ్యూరీ మెంబర్లు నిర్మల, వెంకటరమణ , బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతో విలేకరులకు ప్రయోజనం

ఐడి కార్డుల పంపిణీలో ఆర్డీవో

అతిథుల సన్మాన కార్యక్రమంలో పాత్రికేయులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో ఇటీవల నకిలీ విలేకరులు హల్ చల్ చేస్తుండటంతో వారికి అడ్డుకట్ట వేసేందుకు నిజమైన విలేకరులకు ఐడీకార్డులు పంపిణీ చేయడం ఎంతో ఉపయోగమని ఆర్డీవో తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్మవరం ప్రెస్ క్లబ్ తరపున నూతన గుర్తింపుకార్డులు, ద్విచక్రవాహన స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓ తిప్పేనాయక్, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఒకటో పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సిఐ రాజా, ట్రాఫిక్ సిఐ వహీద్ బాషా, రూరల్ ఎస్ఐ ప్రదీప్ కుమార్, బ్రేక్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి కత్తిమీద సాములాంటిదన్నారు. ప్రతిశాఖ, వ్యవస్థలోను, ప్రతిఒక్కరిని ప్రశ్నించే హక్కు ఒక్క పాత్రికేయులకే ఉందన్నారు. ప్రెస్ క్లబ్ కమిటీ వారికి అన్ని వేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. తహశీల్దార్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ విలేకరులంటూ కార్యాలయాల్లోకి చొచ్చుకువచ్చి అనవసరమైన విషయాలు అడిగి వేధిస్తున్నారని అలాంటి వారిని ఏరివేసేందుకు ఈ ఐడి కార్డులు ఉపయోగపడుతాయని తెలిపారు. వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చాలామంది పాత్రికేయులు కాకపోయినా ద్విచక్రవాహనాలపైన ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరిగే నకిలీలను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జానపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి కోసిన మురళిగౌడ్, గౌరవాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ధర్నాలో పాల్గొన్న నాయకులు, రైతులు

మండల పరిధిలోని పందిపర్తి పొలం సర్వేనెంబర్ 384లో సోమందేపల్లి కి చెందిన దళితులు, వెనుకబడిన కులాల వారు 80 మంది దాకా 200 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారని వీరికి పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు పెద్దన్న, కెవిపిఎస్ హనుమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత రైతులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మురళీకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాగు రైతులకు పట్టాలివ్వటంలో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వెంటనే క్షేత్రస్థాయిలోకి సిబ్బందిని పంపించి సర్వే చేయించి అసైన్మెంట్ చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రంగప్ప, కొండా వెంకటేష్, సాగుదారులు అలివేలమ్మ, చంద్రకళ, గంగాభవాని, శ్యామల, గంగరత్న తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన పుట్టపర్తి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో అన్నదాన కార్యక్రమం

సత్యసాయి జయంతి సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచే కాక, దేశ విదేశాల్లో నుంచి వచ్చిన భక్తులతో పుట్టపర్తి కిక్కిరిసింది. పుట్టపర్తి కేంద్రంగా శ్రీ సత్య సాయి జిల్లా ఏర్పాటు అనంతరం మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపన అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, ప్రసాదాలు అందజేస్తున్నారు. ప్రశాంతి నిలయంలో వేలాదిమంది భక్తులకు మూడు రోజుల నుండి నిరంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మునిసిపల్, పుడా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

నంబుల పూలకుంట : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఈటె రాము అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరుపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి సంపూర్ణ, ఎంపిడిఒ ఆదినారాయణ, ఇఒఆర్‌డి మనోహర్,తో పాటు ఆయా శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేవంలో జెడ్పీటీసీ రాధాబాయి, వైస్ ఎంపిపి ఆనంద్‌నాయక్, ఎంపిడిఒ సుధామణి, ఇఒఆర్‌డి అంజినప్పతో పాటు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కదిరి ఎంపిపి

గొర్రెలను ఢీకొన్న రైలు - 80 మృతి

పట్టాలపై గొర్రెల మృతదేహాలు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి–పెనుకొండ ప్రధాన రైలు మార్గంలో మండల పరిధిలోని ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ అతి సమీపంలో రైలు కిందపడి 80 గొర్రెలు మృతి చెందాయి. కొత్తచెరువు మండలం లోచర్ల గ్రామానికి చెందిన రామాంజి, నారాయణ, లక్ష్మీనారాయణ తమ గొర్రెలను గౌనికుంటపల్లి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన మేపి సాయంత్రం ఇంటికి వెళుతున్న సమయంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదం సంభవించింది. కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు గొర్రెల మందపై దూసుకెళ్లడంతో 80 గొర్రెలకు పైగా మృతి చెందినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. పలు గొర్రెలకు తీవ్ర గాయాలు కాగా కొన్నింటికి కాళ్లు విరిగిపోయాయి. గొర్రెల ముందలో దాదాపు 300కు పైగా గొర్రెలున్నట్లు తెలుస్తోంది. రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో రైలు వస్తున్న విషయాన్ని గమనించకపోవటంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. తమను ఆదుకోవాలని నష్టపోయిన గొర్రెలకాపరులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

బత్తలపల్లి : ఆర్‌ఎంపిపై అర్ధరాత్రి సమయంలో ఇద్దరు యువకులు బీరు సీసాలతో దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో నివాసముంటున్న ఆర్‌ఎంపీ రమేష్ ఇంటిపై 21వ తేదీ అర్ధరాత్రి జయ, ప్రేమ్ అనే యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి బీరు సీసాలతో ఇంటిపై దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. దాడి ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ నేపథ్యంలో నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

చోరీకి గురైన బైక్

ముదిగుబ్బ : మండల కేంద్రం లోని పాత మసీదు వీధిలో ఉన్న వాచ్ మెకానిక్ రియాజ్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఎపి 02. ఎక్స్ 4764 నెంబరు గల ఫ్యాషన్‌ప్రో ద్విచక్రవాహనాన్ని సోమవారం రాత్రి ఇంటికి ఎదుట పార్కింగ్ చేశానని ఉదయం లేచి చూసేసరికి వాహనం కన్పించలేదని బాధితుడు రియాజ్ తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమంత్ కుమార్ తెలిపారు.

దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది దాడులు

కదిరి టౌన్ : ప్లాస్టిక్ పై మున్సిపల్ సిబ్బంది మెరుపు దాడులు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ రమణ ఆధ్వర్యంలో పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ , టవర్ క్లాక్, చౌక్ ఏరియా, టెంపుల్ స్ట్రీట్, కూరగాయల మార్కెట్ ఏరియాలోని పలు దుకాణాలు, గోడౌన్ లో ఉంచిన సుమారు 400కేజీ ల సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు కుసుమలత, రెడ్డిశేఖర్, పవన్, పరమేష్, వేమనారాయణ, మధుసూదన రెడ్డి, అసిఫ్, రామచంద్ర, ప్రతాప్, రాజయ్య, శ్రీనివాసులు, రమేష్ నాయక్, చంద్రశేఖర్ , చంద్రశేఖర్ నాయక్, మోహన్ రెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

భూమిపై హక్కు కల్పించాలని వినతి

బత్తలపల్లి : మండల కేంద్రంలో దాదాపు 40 కుటుంబాలకు చెందిన రజకులు తమ వత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి చెరువు సమీపంలో ఒక్కొక్కరికి రెండున్నర ఎకరాల భూమికి కేటాయించాలని రజకులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మంగళవారం కలిసి విన్నవించుకున్నారు. వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ రాగప్ప, నాయకులు ముసలప్పల ఆధ్వర్యంలో బత్తలపల్లి రజక సంఘం నాయకులు ఎం. సాయినాథ్, ఆర్వేటి లక్ష్మీదేవి. బ్రహ్మయ్య, నారాయణస్వామి, ఆనంద్, ఆర్వేటి శీనా తదితరులు ఎమ్మెల్యేను ధర్మవరంలో కలసి తమ సమస్యను విన్నవించారు. న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రపంచ పటంలో లేపాక్షికి గుర్తింపు ఇవ్వండి

హిందూపురం : శిల్ప కళలకు నిలయమైన లేపాక్షిని ప్రపంచ పటంలో గుర్తింపు తీసుకోచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని ఎమ్మెల్సీ ఇక్బాల్ కోరారు. మంగళవారం పుట్టపర్తిలో జరుగుతున్న సాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన కేంద్రమంత్రిని పుట్టపర్తి విమానశ్రయంలో ఎమ్మెల్సీ కలిసి స్వాగతం పలికారు. ఈసందర్భంగా లేపాక్షి ఆలయ విశిష్టత గురించి వివరించారు. స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తనకల్లు : మండలంలోని ఈతోడు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, సర్పంచి నాగేంద్ర బాబు, ఎంపీటీసీ ఈశ్వరప్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, ఈతోడు రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, వైసిపినాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని చోలెమర్రి పంచాయితీలో గోబ్బరంపల్లిలోని మండల పరిషత్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ భూమిపూజ చేశారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, తిమ్మయ్య, ఎంపీపీ చంద్రశేఖర్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు , సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చెన్నేకొత్తపల్లి : స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు.ఉరవకొండ మండలంలోని అమిద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన అండర్ 17, అండర్ 14 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనపర్చిన లిఖిత, భవ్యశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యాడు. ప్రతిభా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ ప్రసాద్, పీడీ నల్లప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయిబాల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శైలజ తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 19న జరిగిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-11 విభాగంలో మహేష్‌బాబు, చిరంజీవి, అండర్-17 విభాగంలో పవన్‌కుమార్ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అన్నమయ్యజిల్లాలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పీడీలు నాగేంద్ర, నవీన్ కుమార్, ఉపాధ్యాయులు రఫిక్ అహ్మద్, హేమలత, శ్రీనివాసులు, శంకరనారాయణ, ప్రసాద్, రామకృష్ణ తదితరులు అభినందించారు.

సోమందేపల్లి : మండల పరిధిలోని మేకలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి చదువుతున్న నందీశ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయుడు కె లింగరాజు తెలిపారు. 21వ తేదీన ఉరవకొండ మండలం అమిద్యాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 క్రీడా పోటీల్లో నందిశ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

హిందూపురం : పట్టణంలోని కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మనోజ్ కుమార్ రెడ్డి రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కేశవమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మనోజ్ కుమార్ రెడ్డిని హెచ్‌ఎంతో పాటు పీడీ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

మీ కోసం

ఆమ్లెట్ పొంగినట్లు రావాలంటే, చిటికెడు పంచదార లేదా మొక్కజొన్న పిండి కలపాలి.

జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

చదువు విలువ



చరిత తొమ్మిదవ తరగతి చదువుతోంది. ప్రతి రోజూ అమ్మా నాన్నల దగ్గర గొడవ చేసి డబ్బులు తీసుకొని పాఠశాలకు వెళ్ళేది. తండ్రి సీతయ్య వ్యవసాయ కూలీ. రోజూ కూతురికి డబ్బులు ఇవ్వడం కష్టంగా అనిపించేది. పుస్తకాలు కొనాలి, పరీక్ష ఫీజు కట్టాలంటూ డబ్బులు తీసుకునేది. ఆ డబ్బులతో ఫ్రెండ్స్‌తో కలిసి దుబారా ఖర్చు చేస్తూ ఉండేది.

చరిత పాఠశాల బయట ఓ మర్రి చెట్టు కింద 70 ఏళ్ల వృద్ధుడు పొద్దస్తమానం పుస్తకాలు చదువుతూనే ఉండేవాడు. సాయంత్రం కాగానే పిల్లలకు పాఠాలు చెప్పేవాడు. ఇది గమనించిన చరిత ఒకరోజు పాఠశాలకు వెళ్తూ ఆ వృద్ధుడు దగ్గర ఆగింది. 'తాతా.. ఈ వయసులో కూడా మీరు పుస్తకాలు చదువుతారు ఎందుకు?' అని అడిగింది.

అమ్మా! నేను నీ వయసులో ఉన్నప్పుడు చదువు విలువ తెలియక చదువును నిర్లక్ష్యం చేశాను. స్నేహితులతో కలిసి పొలాల వెంట తిరిగాను. పెద్దయ్యాక ఊర్లోనే కూలీనాలీ చేసుకుంటూ బతికాను. కష్టాలు పడి నా పిల్లలను చదివించాను. వాళ్ళు జీవితంలో స్థిరపడ్డారు. చదువ విలువ తెలుసొచ్చింది. అందుకే ఇప్పుడు చదువుతున్నా. అర్థం చేసుకున్న విషయాలను పిల్లలకు బోధిస్తున్నా.' అన్నాడు.

తన తప్పును తెలుసుకున్న చరిత ఆ రోజు నుంచి తండ్రిని డబ్బులు అడగడం మానేసింది.ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకుంది. కూతురిలో వచ్చిన మార్పుకు సీతయ్య చాలా సంతోషించారు.

- ఖర్జూరపు సరిత , 9వ తరగతి,
మేళ్ళచెరువు,సూర్యాపేట,
63053 93291.





తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి.
అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

- సి. భవాని,
టెక్ జూనియర్ కళాశాల,
తాడిపత్రి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమాజంలో మహిళలు రకరకాల రూపాల్లో హింసను ఎదుర్కొంటున్నారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొని జీవించడమే గొప్ప ధైర్యం. కోల్పోయిన జీవితాన్ని తిరిగి పొందడం అనేది మరింత సాహసం. డాక్టర్ మహాలక్ష్మి ఈ కోవకే చెందుతారు. వైద్యం అందిస్తున్న ఆమెపై జరిగిన యాసిడ్ దాడి మానసికంగా కుంగదీసింది. అయినా ఆత్మస్థైర్యంతో తిరిగి తన జీవితాన్ని నిర్మించుకోవడంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. చూపు లేదని నిరుత్సాహపడలేదు. వైద్యసేవలు అందిస్తూనే తనలాంటి బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నారు.

చూపులేకపోయినా వైద్యం అందిస్తూ ...

కర్ణాటక, మైసూరుకు చెందిన మహాలక్ష్మి ఇరవై ఏళ్ల క్రితం డాక్టర్ పట్టా పుచ్చుకున్నారు. మంచి వైద్యురాలిగా పేరు తెచ్చుకోవాలన్న ఆశతో క్లినిక్ ప్రారంభించారు. శివబసవయ్య అనే వ్యక్తికి చెందిన భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. కొన్ని నెలలకు మరొక భవనానికి మహాలక్ష్మి ఆసుపత్రిని మార్చారు. తాను ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి ఇవ్వమని శివ బసవయ్యను అడగ్గా... అతడు లెక్కచెయ్యలేదు. ఆమెను బెదిరించాడు. 'డబ్బులు ఇవ్వను... ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ దుర్భాషలాడాడు. దాంతో మహాలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. అది సహించలేక అతను, ఆమె ఒంటరిగా ఉన్న సమయం చూసి యాసిడ్ దాడి చేశాడు. దీన్ని ప్రత్యక్షంగా చూసిన వారు కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు వెనకాడారు. అయినా మహాలక్ష్మి వెనకడుగు వేయలేదు. ఆధారాలు సేకరించి నిందితుడికి శిక్షపడేలా చేశారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవమానాలూ ఎదుర్కొన్నారు. ఆమె కుటుంబం అడుగడుగునా ఆమెకు అండగా నిలబడింది. ఆ ధైర్యమే ఆమెను తిరిగి మనిషిని చేసింది.

బలవంతులు మాత్రమే సమాజంలో జీవించగలరు. బలహీనులు రోజూ చస్తూ బతుకుతారు అన్న మాటలు ఆమెను నిత్యం వెంటాడసాగాయి. మహాలక్ష్మి శారీరకంగా, మానసికంగా నిత్యం జీవన పోరాటం సాగించారు. దాడి జరిగిన రోజు ఆమె అనుభవించిన బాధ, రోదన జీవితంలో మరిచిపోలేనిది. మంచినీళ్ల కోసం పెట్టిన కేకలు హృదయ విదారకం. కనీసం హాస్పటల్‌కు తీసుకెళ్లేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. దూరంగా జనం ఉన్నా - అతను ఏం చేస్తాడోనన్న భయంతో ఆమె దగ్గరకు వచ్చే సాహసం చేయనీయలేదు.

యాసిడ్ వల్ల కళ్లు పోగొట్టుకున్న మహాలక్ష్మి ఇంటికే పరిమితమైంది. ఏడాది పాటు మంచం మీద ఉండిపోయారు. గాయాల నుంచి రక్తం కారుతూ, మంటలు వచ్చేవి. భరించలేక చాలారోజులు ఏడ్చారు. మానసికంగా కుంగిపోయారు. అదే సమయంలో ఆమె ఆలోచనల్లో పడ్డారు.

తప్పు చేసిన వాడు బయట తిరుగుతున్నాడు.. ఏ తప్పూ చేయని నేనెందుకు ఇంట్లోనే ఉండాలి? కళ్లు పోతే ఏం చేయలేమా? సాధించలేమా? అన్న ప్రశ్నలు ఆమెను ఇంట్లో ఉండన్విలేదు. అక్కలు, అమ్మ సహాయంతో బయటకు అడుగు వేశారు. దాడిచేసిన వ్యక్తిపై తిరిగి కేసు పెట్టారు. కానీ జిల్లా కోర్టులో ఆమెకు నిరాశ ఎదురైంది. శివబసవయ్య నిర్దోషిగా బయటకు వచ్చాడు. దాంతో మహాలక్ష్మి నిందితునికి శిక్ష పడాలంటూ, తనకు న్యాయం చేయమని తర్వాత కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. పదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం చేయగా హైకోర్టు ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించి, మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

తిరిగి చదువుకుని ...

కళ్లులేని కారణంగా వైద్యవృత్తిలో రాణించటం కష్టం.. నోటి ద్వారా అయినా ప్రజలకు వైద్యం చేయాలనుకున్నారు. ఎంఎస్సీ సైకాలజీలో చేరి, డిగ్రీ సాధించారు. అయితే, కాలిపోయిన ఆమె శరీరాన్ని చూసి చాలామంది భయపడిన సందర్భాలు ఆమెను బాధపెట్టాయి. 50 శాతం కాలిపోయిన ముఖానికి శస్త్రచికిత్సలు చేయించుకోవడం మొదలు పెట్టారు. అప్పుడు కూడా ఎంతో బాధను భరించారు. మొఖం, రెండు చేతులకూ 10 ఏళ్ల పాటు నెలల వ్యవధిలో 25 సార్లు శస్త్రచికిత్సలు చేయించారు. సైకాలజిస్టుగా తనకు తాను మొదట పేషెంట్‌గా ఫీలయ్యారు. జరిగిన దాడి నుంచి బయటపడేలా మనోధైర్యం తెచ్చుకున్నారు. మహాలక్ష్మి పట్టుదల, ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో ఉద్యోగ అవకాశం కల్పించారు. దాంతో తన దగ్గరకు వస్తున్న మానసిక రోగులకు కౌన్సిలింగ్ చేస్తూ, శారీరక ఆరోగ్యంపై ఏవిధంగా దృష్టి సారించాలో వివరిస్తున్నారు. ప్రతిరోజూ 60 - 80 మంది రోగులు ఆమె దగ్గరకు వస్తూ ఉంటారు. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నానన్న తృప్తితో తనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోతున్నారు. కోవిడ్ సమయంలోనూ పేషెంట్లకు కౌన్సిలింగ్ చేశారు. టీకాల పంపిణీలో ఊరురా తిరుగుతూ క్యాంపెయన్‌లో పాల్గొన్నారు.

మహిళ సాధికారతకు కృషి

'మహిళలకు విద్య చాలా ముఖ్యం. నేను తిరిగి నిలబడ్డాను అంటే చదువుకోవడం వల్లే. ఆ సమయంలో నా కుటుంబం నాకు రక్షణగా నిలిచింది. వారి ఇచ్చిన ధైర్యంతోనే తిరిగి జీవితాన్ని ప్రారంభించా. మహిళలకు సమాజంలో ఎదురయ్యే దాడులు, వేధింపుల నుంచి బయటపడేందుకు బలమైన సహాయక వ్యవస్థను ప్రభుత్వాలు కల్పించాలి.' అంటారు మహాలక్ష్మి. ఇప్పుడామె ఎంతోమంది మహిళలకు ధైర్యవచనం. తన దగ్గరకు వస్తున్న మహిళల వ్యక్తిగత, గృహహింస విషయాలు తెలుసుకుని, వాటి నుంచి ఎలా బయటపడాలో చెబుతున్నారు. చదువుకోవాలనుకున్న వారికి సహాయం చేస్తున్నారు. యాసిడ్ దాడి బాధితులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారిలో స్ఫూర్తి నింపుతున్నారు. డాక్టర్ మహాలక్ష్మి ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు.



బాసు వస్తుండే ...

బాబీ దర్శకత్వంలో హీరో చిరంజీవి నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్ విడుదల చేసింది చిత్ర బృందం. ఇప్పుడు చిత్రంలో ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేసింది. పూర్తి పాటను 23న విడుదల చేస్తున్నట్లు పోస్టర్ విడుదల చేసింది. పాటలో పూర్తి మాస్ గెటప్‌లో చిరంజీవి కనిపించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతంతో 'బాసు వస్తుండే...' అని పాట ఆయన పాడారు. శృతిహాసన్ హీరోయిన్‌గా, చిరంజీవి తమ్ముడి పాత్రలో రవితేజ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల కానుంది.

'అవతార్ : ది వే ఆఫ్ వాటర్' కొత్త ట్రైలర్

'అవతార్' మొదటి పార్ట్ వచ్చిన పదమూడేళ్ల తరువాత రెండో పార్ట్ 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' డిసెంబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఇటీవల ట్రైలర్ విడుదలైంది. అవతార్ సినిమాను ఈసారి వాటర్‌లో తెరకెక్కించాడు జేమ్స్ కామెరాన్. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా ప్రీమియం ఫార్మాట్‌లలో ఓపెన్ అయ్యాయి. 20వ సెంచరీ స్టూడియోస్ ఇండియా నిర్మించిన ఈ చిత్రం ఇంగ్లిష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంలో విడుదల కానుంది.

సౌదీ సంచలనం

అర్జెంటీనాపై 2-1 గోల్స్‌తో రికార్డు గెలుపు

ఫిఫా ప్రపంచకప్

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో తొలి సంచలనం నమోదైంది. మంగళవారం జరిగిన గ్రూప్-సి లీగ్ మ్యాచ్‌లో సౌదీ అరేబియా జట్టు 2-1 గోల్స్ తేడాతో మాజీ ఛాంపియన్, టైటిల్ ఫేవరెట్ అర్జెంటీనాపై అనూహ్య విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి 10 నిమిషాల్లోనే అర్జెంటీనా సీనియర్ ఆటగాడు లియోనెల్ మెస్సీ పెనాల్టీని గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో ప్రథమార్థం ముగిసే సమయానికి అర్జెంటీనా 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం 48వ నిమిషంలో సలేహ్ అల్ షెహ్రీ చేసిన గోల్‌తో సౌదీ అరేబియా 1-1తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత మరో ఐదు నిమిషాలకే సలేమ్ అల్ దవ్సారీ చేసిన గోల్‌తో సౌదీ అరేబియా ఆధిక్యంలోకి దూసుకుపోయింది. అయితే స్కోరును సమం చేసేందుకు అర్జెంటీనా ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్జెంటీనా ఫార్వర్డ్‌ల దాడులను సౌదీ అరేబియా గోల్ కీపర్, డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. దాంతో మెస్సీ సేనకు భంగపాటు తప్పలేదు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా 3వ స్థానంలో ఉండగా... సౌదీ అరేబియా 51వ ర్యాంక్‌లో ఉంది. దీంతో వరుసగా 36 మ్యాచ్‌ల్లో గెలిచి ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన అర్జెంటీనా జైత్రయాత్రకు ఈ మ్యాచ్‌తో సౌదీ అడ్డుకట్ట వేసి రికార్డు నెలకొల్పింది.

అంతకుముందు జరిగిన గ్రూప్-ఏ లీగ్ మ్యాచ్‌లో అమెరికా-వేల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1గోల్స్‌తో డ్రా కాగా.. గ్రూప్-డిలో డెన్మార్క్-ట్యూనీషియా మ్యాచ్ 0-0తో డ్రా అయ్యాయి. సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 2-0గోల్స్ తేడాతో సెనెగల్‌ను ఓడించింది. నెదర్లాండ్స్ 2గోల్స్‌ను మ్యాచ్ ముగియడానికి 10నిమిషాల ముందు చేయడం విశేషం. 84వ నిమిషంలో కోడే గక్పో 84వ ని.లో, 99వ నిమిషంలో గావీ క్లాసెన్ ఒక్కో గోల్ కొట్టారు. సెనెగల్ జట్టు 15సార్లు నెదర్లాండ్స్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా ఫలించలేదు.

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు..

గ్రూప్-డి: ఫ్రాన్స్ X ఆస్ట్రియా(మ.12.30గం॥లకు)
గ్రూప్-ఎఫ్: మొరాకో X క్రొయేషియా(సా.3.30గం॥లకు)
గ్రూప్-ఇ: జర్మనీ X జపాన్(రా.6.30గం॥లకు)
స్పెయిన్ X కోస్టారికా(రా.9.30గం॥లకు)

విడాకుల వివాదంపైశ్రీకాంత్ స్పందన

తన సతీమణి ఊహకు విడాకులు ఇస్తున్నట్లు జరిగిన ప్రచారాన్ని సినీనటుడు శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఊహకు నేను విడాకులు ఇస్తున్నట్లు పలు వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానళ్లలో ప్రచారం జరుగుతోంది. కొన్ని వెబ్‌సైట్లలో వచ్చిన ఫేక్ న్యూస్ చూసి ఊహ ఆందోళనకు గురైంది. ఆ ప్రచారంపై బంధువుల నుంచి ఫోన్లు వస్తుంటే వివరణ ఇచ్చుకోలేకపోతున్నాం. నాపై అసత్య ప్రచారం చేస్తున్న ఛానళ్లపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తా. నిరాధారమైన వదంతులు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని శ్రీకాంత్ పేర్కొన్నారు.

సిరీస్ విజేత భారత్

ఆర్ష్‌దీప్, సిరాజ్‌కు నాలుగేసి వికెట్లు.. టైగా ముగిసిన మూడో టి20

నేపియర్: మూడు టి20ల సిరీస్‌ను టీమిండియా 1-0తో కైవసం చేసుకుంది. ఇరుజట్ల మధ్య మంగళవారం జరిగిన మూడో, చివరి టి20 టై అయ్యింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి టీమిండియా 9 ఓవర్లలో 4 వికెట్లకు 75 పరుగులు చేసింది. దీంతో డక్ వర్త్ లూయిస్ విధానం ప్రకారం ఇరుజట్ల స్కోర్లు కావడంతో మ్యాచ్ టై అయినట్టు రిఫరీ ప్రకటించారు. దీంతో మూడు టి20ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దుకాగా.. రెండో టి20లో టీమిండియా 65పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగిన మూడో టి20లో న్యూజిలాండ్ టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగి 19.4 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. కాన్వే 59, ఫిలిప్స్ 54 అర్ధసెంచరీలతో రాణించారు. సిరాజ్, ఆర్ష్‌దీప్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. టి20ల్లో ఇద్దరు భారత బౌలర్లు నాలుగేసి వికెట్లు తీయడం ఇదే ప్రథమం కాగా.. ఆర్ష్‌దీప్ సింగ్ తృటిలో హ్యాట్రిక్‌ను మిస్ చేసుకున్నాడు. 161 లక్ష్యంతో బరిలో దిగిన టీమిండియా 9 ఓవర్ల వద్ద వర్షం రావడంతో మ్యాచ్‌కు నిలిచిపోయింది. మ్యాచ్ నిలిచే సమయానికి టీమిండియా గెలుపు 66 బంతుల్లో 86 పరుగులు చేయాల్సి ఉంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (30 బ్యాటింగ్), దీపక్ హుడా (9బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్ 10, రిషబ్ పంత్ 11, సూర్యకుమార్ 19, శ్రేయస్ 0 నిరాశపరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్‌కు, సిరీస్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించాయి.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)
న్యూజిలాండ్ : 160ఆలౌట్, (కాన్వే 59, ఫిలిప్స్ 54, ఆర్ష్‌దీప్ 4/37, సిరాజ్ 4/17)
భారత్ : 75/4 (9 ఓవర్లలో)
(హార్దిక్ 30(నాటౌట్), సాంట్నర్ 1/5)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484, and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422